

వెన్నం అంజయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ఖానాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వెల్లడించిన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య చోటు దక్కించుకున్నారు. అంజయ్య నిర్మల్‌లోని సిటీఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకోనున్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించడమే కాకుండా విద్యార్థులకు తరచూ ఉచితంగా విద్యా సామగ్రిని విరాళంగా అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న అంజయ్య ఈ అవార్డుకు ఎంపికవడం పట్ల పలువురు ఆయనను అభినందించారు.

పల్లెదారులకు మహర్దశ

గ్రామీణ రోడ్లు.. అభివృద్ధి కానున్నాయి. ఇందుకోసం పలు ప్రతిపాదనలను అధికారులు పంపగా.. కొన్నింటికీ ఆమోదం కూడా లభించింది. దీంతో అధ్వానంగా ఉన్న పల్లె రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ లోని పలు ప్రాంతాల్లో మొత్తం 30 రోడ్లకు ఆమోదం లభించడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఈ పనులపై కసరత్తు చేస్తోంది.



జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం

- రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఫస్ట్ ఫేజ్ కింద ఉమ్మడి జిల్లాలో 30 రోడ్ల పరిశీలన
- రూ.659.97 కోట్లతో అంచనాలు
- జిల్లా కేంద్రానికి రోడ్ల అనుసంధానం
- పలు పనులకు ఆమోదం

నిర్మల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రహదారుల అభివృద్ధికి హమ్ (హైబ్రిడ్ ఆన్యుటీ మోడ్) ప్రోగ్రాం కింద ఆర్‌అండ్‌బీ శాఖ రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆర్‌అండ్‌బీ సర్కిల్స్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 5190.25 కిలోమీటర్ల పొడవుతో మొత్తం 373 రోడ్లనిర్మాణాలకు గాను 6478.33 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో నుంచిరుట ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కు సంబంధించిన మొత్తం 30 రోడ్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. 572.32 కిలోమీటర్ల పొడవుతో ఈ 30 రోడ్లను నిర్మించనున్నారు. దీనికోసం గాను మొత్తం 659.97 కోట్ల రూపాయలతో రూపొందించిన అంచనాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులన్నింటినీ మొదటి దశకింద ఆర్‌అండ్‌బీ శాఖ చేపట్టబోతోంది. దీనికి సంబంధించిన కాంట్రాక్ట్ ఏజెన్సీకి పనులను అప్పజెప్పనుంది. కొత్తగా రోడ్లను నిర్మించడమే కాకుండా రోడ్లను వెడల్పు, మరమ్మతులు నిర్వహించడం లాంటి పనులన్నీ ఈ ప్రతిపాదనలో చేర్చారు.

ఆదిలాబాద్ సర్కిల్‌లో 18 రోడ్లు..

ఆదిలాబాద్ ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు కొనసాగుతున్నాయి. మూడుజిల్లాల్లో 313.09 కిలోమీటర్లతో 18 రోడ్ల పనులను చేపట్టేందుకు నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో కాప్రి, బాలాపూర్, సవాపూర్, పెండల్వాడ, కౌట, ఆనంద్‌పూర్, కుర వరకు రోడ్డును అలాగే ఆదిలాబాద్ నుంచి కెరమేరి వరకు, బోథ్ పరిధిలోని వాంకిడి నుంచి మహబూబ్ ఘాట్ వరకు, ఇచ్చోడ నుంచి సిరిచెల్మ, వయా మంకాపూర్, నర్సాపూర్, చించోలి, జామిడి వరకు అలాగే గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ రోడ్డు వర కు రోడ్లను నిర్మించనున్నారు. దీంతోపాటు ఆదిలాబాద్ నుంచి తలాయిగూడ రోడ్డు వయా రాంపూర్, పొన్నారి రోడ్, హస్నాపూ ర్, సుంకిడి, లక్ష్మీపూర్ వరకు హమ్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వరకు గల రోడ్డును అలాగే ఉట్నూర్ నుంచి ఇంధన్‌పల్లి వరకు రోడ్డు ను నిర్మించనున్నారు. వీటితో పాటు నిర్మల్ జిల్లాలోని వాంకిడి, కడ్తాల్ సెక్షన్ పరిధిలో నిర్మల్‌టౌన్ లిమిట్స్ వరకు, నిర్మల్ అప్పారావుపేట్ రోడ్డు వయా చించోలి(బి), సాయినగర్, ధని, జామ్, సారంగాపూర్, కౌట్ల(బి), స్వర్ణ, రామ్‌సింగ్ తం డాతో పాటు సిరిపెల్లి వరకు, సిర్గాపూర్ నుంచి వయా కాల్వతండా, కాల్వ, బీరవెల్లి, వంజర్, చించోలి(ఎం) మీదుగా కౌట్ల వరకు, ముథోల్ నియోజకవర్గ పరిధిలోని అర్లీ, లోకేశ్వరం రోడ్డును అలాగే భైంసా నుంచి కుబీర్ వరకు గొడిసెరా, బాకోట్, పాంగ్రా, పార్డి, పల్సి, సిరిపల్లి మీదుగా రోడ్డును నిర్మించనున్నారు. అలాగే ఇదే నియోజకవర్గంలోని ముథోల్ నుంచి తానూర్ వరకు సింగన్ గావ్, జెవ్లా, వడ్గంల మీదుగా రోడ్డు నిర్మించనున్నారు. ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఖానాపూర్ బెల్లాల్ రోడ్డు వయా తర్లపాడ్, దిలావర్‌పూర్, మల్లాపూర్, లింగాపూర్, ఎలగడప, మద్దిపడగ, చిట్యాల, పెద్ద బెల్లాల్, నర్సింగాపూర్‌ల మీదుగా ఈ రోడ్డును నిర్మించబోతున్నారు. అలాగే ఖానాపూర్ తర్లపాడ్ రోడ్డును కూడా నిర్మించేందుకు హమ్‌రోడ్డు కింద చర్యలు చేపట్టనున్నారు. మంచిర్యాల జిల్లాలో మొత్తం 12 రోడ్ల నిర్మాణం కాగా హమ్ రోడ్ల ప్యాకేజీలు భాగంగా మంచిర్యాల జిల్లాలోని మొత్తం 12 రోడ్లను 259.23 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్నారు. దీనికోసం గాను 294.29 రూపాయలతో సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పెండింగ్ కేసులు పరిష్కరించాలి
- సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలి
- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ డా. జి. జానకీషర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎస్పీ డా.జి.జానకీ షర్మిల మంగళవారం అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లాంగ్ పెండెన్సీ కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వీటిపై నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా, చట్టం - శాంతి పరిరక్షణ, అలాగే ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో నేరాల నిరోధక చర్యలను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో నేరాలపై పటిష్ఠ నిఘా కొనసాగించాలని, ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ఆసుపత్రి తనిఖీ


ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మహిళాశక్తి క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. అనంతరం లాబొరేటరీ, స్కానింగ్ కేంద్రం, ఇన్‌వార్డు, అవుట్ వార్డు, ఆపరేషన్ థియేటర్, ఓపీ వార్డు, బాలింతల వార్డులను సందర్శించి రోగుల పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులకు పలు సూచనలు చేస్తూ గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు సమయానికి అందించాలన్నారు. ప్రసవాల సమయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగుల విషయంలో శ్రద్ధ వహించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, ఆసుపత్రి పర్యవేక్షకులు సరోజ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- ఆర్జీయూకేటీలో బోధన మెళకువల సదస్సులో యూఎస్‌ఏ ప్రొఫెసర్


అధ్యాపకుల శిక్షణా సదస్సులో మాట్లాడుతున్న యూఎస్‌ఏ ప్రొఫెసర్

బాసర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో బాసర ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో బోధనా మెలకువలపై మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యూఎస్‌ఏ నుంచి ప్రొఫెసర్ గోపాల్ టికే కృష్ణ పాల్గొని అధ్యాపకులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. విద్యార్థులు చదువును ఇష్టపడి చేర్చుకుంటేనే చదువు గొప్పతనం అర్థమవుతుందని పేర్కొన్నారు. అనిష్టంగా నేర్చుకున్నది దీర్ఘకాలం గుర్తుండదని, పిల్లలు శాస్త్రీయ పద్ధతిలో నేర్చుకునేలా ఆధ్యాపకులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. సాంకేతికతను అత్యవసరమైతేనే వినియోగించాలనే దృక్పథం విద్యార్థుల్లో పెంపొందించాలని చెప్పారు. తల్లిదండ్రులను వదిలి దూరప్రాం తాల నుంచి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అండగా నిలిచి, వారి భయాందోళనలను తొలగించాలని సూచించారు. చదువుతోపాటు సహనం, వినయం పెంపొందించడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆర్జీయూకేటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫేసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి మేధస్సు కలిగి ఉంటాడని, కాని చాలా మంది దాన్ని సద్వినియోగం చేసుకోవడంలో వెనుకపడతారని అన్నారు. సమయ పాలన, క్రమశిక్షణను అలవాటు చేసుకుంటేనే వారు గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని చెప్పారు. పత్రికలు, పుస్తకాలు చదివే అలవాటు పెంపొందిచడం అత్యవసరమన్నారు. సదస్సులో అసోసియేట్ డీన్లు డా.చంద్రశేఖర్, డా.మహేష్, పిఆర్‌వో డా.బి. బాలకృష్ణతో పాటు ఆర్జీయూకేటీ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి అంజీ ప్రసాద్


డివిజన్ వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ దిగుబడులు వచ్చే సమయం ఆసన్నమవుతున్నందున పంటల నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి అంజీ ప్రసాద్ సూచించారు. మంగళవారం భైంసాలోని ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, విస్తీర్ణాధికారులతో మాట్లాడారు. వ్యవసాయ విస్తీర్ణాధికారులు తమ తమ క్లస్టర్ల పరిధిలోని పంటచేలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సాగులోనున్న పంటల వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. తప్పులకు తావులేకుండా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జాగరుకతతో చేపట్టాలన్నారు. లోటుపాట్లకు ఆస్కారం లేకుండా నడుచుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకున్న దిగుబడుల విక్రయ ప్రక్రియలో అన్నదాతలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నమోదు చేసిన వివరాల ఆధారంగానే దిగుబడుల విక్రయాలకు సంబంధించిన టోకెన్లు జారీ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని వెల్లడించారు. మండల వ్యవసాయాధికారులు బాధ్యతాయుతమైన విధానాల ద్వారా పంటల నమోదు ప్రక్రియ వ్యవస్థను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఇందులో భైంసా ఏడీఏ వీణా, వ్యవసాయాధికారి గణేష్ విస్తీర్ణాధికారులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) ఎస్‌బీఐలో భారీ మోసాలు

- మరో ఇద్దరి ఖాతాలపై విచారణ

నర్సాపూర్(జి), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జరిగిన రుణమోసాలపై విచారణ కొనసాగుతోంది. సోమవారం ఆదిలాబాద్ నుంచి వచ్చిన ఎస్‌బీఐ చీఫ్ ఆపరేషన్ అధికారి సత్యనారాయణ, మండల కేంద్రానికి చెందిన గడ్డం చరణ్ తన గోడును వెల్లడించారు. తన బంగారు ఆభరణాలతో పాటు తన స్నేహితుడు ప్రశాంత్ ఇచ్చిన బంగారు గాజులను కూడా లోన్‌కోసం కుదవ పెట్టారని, అయితే ప్రశాంత్ తనను మోసం చేశారని చరణ్ ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన బ్యాంక్ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన ఎస్‌బీఐ అధికారి సత్యనారాయణ మంగళవారం విచారణకు రావాల్సిన మరి కొంత మంది ఖాతాదారులు అందుబాటులో లేకపోవడంతో వారి ఇళ్లకు నోటీసులు అతికించినట్లు తెలిపారు. అలాగే నర్సాపూర్‌కు చెందిన గడ్డం చరణ్, మరోవ్యక్తి కుదవ పెట్టిన ఖాతాలను నిర్మల్ నుంచి వచ్చి బ్యాంక్ అధికారి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని ఆయన వెల్లడించారు.

పోలీసులకు ఫిర్యాదు..

బ్యాంక్‌ను మోసం చేసిన వారిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని సత్యనారాయణ తెలిపారు. నాణ్యత లేని బంగారు ఆభరణాలను కుదవ పెట్టి డబ్బులు తీసుకున్న వారిపై హైదరాబాద్ నుంచి అనుమతులు రాగానే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. మండల వాసులు, బ్యాంక్ అధికారులు చెబుతున్న దాని ప్రకారం ప్రశాంత్, అతని స్నేహితులు నకిలీ బంగారు ఆభరణాలను కుదవ పెట్టి బ్యాంక్‌ను మోసం చేశారని, ఇలా మోసాలకు పాల్పడిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అంటున్నారు. అధికారులు ప్రశాంత్‌ను సంప్రదించడానికి ప్రయత్నిస్తుంటే అతని సరైన చిరునామా తెలియడం లేదని బ్యాంక్ అధికారులు వాపోయారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా ఒక అప్రైజర్‌ను రప్పించి అన్ని ఆభరణాలను తనిఖీ చేస్తే మరిన్ని మోసాలు బయటప పడతాయని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, సెప్టెంబరు, 16 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు కస్తుర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలిగించకుండా చూడాలన్నారు ఆ తర్వాత అందకూర్ గ్రామంలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కార్మికుల ఫిర్యాదులపై సబ్‌కలెక్టర్ విచారణ


వాహనంలో కూర్చున్న సబ్‌కలెక్టర్ సంకేత్ కుమార్‌తో మాట్లాడుతున్న కమిషనర్

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేతనాల చెల్లింపులు, పీఎఫ్ ఖాతాల్లో డబ్బుల జమ, అక్రమ వసూళ్లపై భైంసా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేసిన ఫిర్యాదులపై సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ విచారణ చేపట్టారు. మంగళవారం విచారణ కమిటిలోని బృందంతో కలిసి మధ్యాహ్నం వేళలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మున్సిపల్ కార్యాలయానికి తరలివెళి కార్యాలయంలోని అకౌంట్ సెక్షన్ విభాగానికి వెళ్లి అక్కడ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాల చెల్లింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పీఎఫ్ ఖాతాల్లో జమ చేసిన డబ్బుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ ప్రత్యేకాధికారి చాంబర్‌కు వెళ్లి అక్కడ వేతనాల పెంపు కోసం అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు చేసిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణ చేపట్టారు. ముందుగా ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను ఒక్కొక్కరిగా ప్రత్యేధికారి చాంబర్‌లోకి పిలిపించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్రమ వసూళ్లు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్లు నలుగురిని పిలిపి విచారించారు. డబ్బులు ఎందుకోసం వసూళ్లు చేశారని, సంబంధిత డబ్బులు ఎక్కడ ఉన్నాయని వివరాలపై ఆరా తీసినట్లుగా తెలిసింది. అటు తర్వాత మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీష్ అహ్మద్, కమిషనర్ రాజేష్ కుమార్‌లను సైతం పిలిపించి పలు వివరాలు అడిగి తెలుసుకుంటూ విచారణ పర్వాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విచారణ ముగించుకుని వెళ్తున్న సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌ను కలిసిన విలేకరులు పలు వివరాలు అడిగే ప్రయత్నం చేయగా నాట్ నౌ అని సమాధానం చెప్పి మున్సిపల్ కార్యాలయం నుంచి బయటకి వెళ్లిపోయారు.

ఓటర్ల జాబితా సవరణకు భైంసా సబ్‌కలెక్టర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సాపూర్(జి) : మండలంలోని ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలపై సామాజిక కార్యకర్తలు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన వార్త కథనంపై అధికారులు స్పందించారు. భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్ ఓటర్ల జాబితా సవరణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మండల తహసీల్దార్ శ్రీకాంత్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. సామాజిక కార్యకర్తలు జాదవ్ మోతిలాల్ పటేల్, సయ్యద్ కలీం ఇటీవల సబ్ కలెక్టర్‌ను కలిసి, వార్డుల వారీగా ప్రచురించిన ఓటర్ల జాబితాలో తప్పులున్నాయని ఫిర్యాదు చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీకాంత్ ఓటరు సవరణ ప్రత్యేక విచారణ అధికారిగా, ఎంఏ వహీద్ నాయబ్ తహసీల్దార్‌గా నియమించారు. నాలుగు రోజుల్లో సవరణ జాబితాను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఆంధ్రజ్యోతి కథనానికి వచ్చిన ఈ స్పందనపై సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల


గడ్డెన్న ప్రాజెక్టు వరద గేటు నుంచి నీటి విడుదల

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అధికశాతం ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 21 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నర్సాపూర్ (జీ) మండలంలో 46.8 మి.మీ వర్షం కురిసింది. ఇక సోన్ మండలంలో 44 మి.మీ, కడెం మండలంలో 39.4, దిలావర్‌పూర్ 32.4, మామడ 30.2, పెంబి మండలంలో 28.6మి.మీ, భైంసా మండలంలో 28.2 మి.మీ, లోకేశ్వరం మండలంలో 21.6 మి.మీ, ముథోల్ మండలంలో 19.6 మి.మీ, లక్ష్మణచాంద మండలంలో 15.6 మి.మీ, నిర్మల్ రూరల్ పరిధిలో 15.4 మి.మీ, కుంటాల మండలంలో 13.8మి.మీ, దస్తురాబాద్ 12.6 మి.మీ, నిర్మల్ 11.6 మి.మీ. కుబీర్ 10.8 మి.మీ, బాసర 8.8 మి.మీ. ఖానాపూర్ 8.6 మి.మీ, సారంగపూర్ 6.4మి.మీ, తానూర్ 3.0మి.మీ వర్షపాతం నమోదైంది. భారీవర్షం మూలంగా పలు ప్రాంతాల్లోని పంట చేలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లోని పంట చేలు వరద నీటిని ఉధృతి ప్రవాహానికి కోతకు గురయ్యాయి.

ఎగువ భాగంలో కురిసిన భారీ వర్షాల మూలంగా గడ్డెన్న ప్రాజెక్టులోకి 1200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు పరిస్థితిని సమీక్షించి సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఒక వరద గేటును ఎత్తి దిగువన ఉన్న సుద్దవాగులోకి 4377 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా, మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో నీటి మట్టం 358.5 మీటర్లుగా ఉంది. ఇక ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1.83 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 1.712 టీఎంసీలుగా ఉంది.

'కార్మికుల వృత్తినైపుణ్యాలను పెంపొందించాలి'



లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దత్తోపంత్ తెంగాడి జాతీయ కార్మిక, విద్యా, అభివృద్ధి ప్రాంతీయ బోర్డ్ హైదరాబాద్ సభ్యులుగా మరో రెండేళ్లు ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల కొనసాగుతారని రీజినల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జానకి రామ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రీజినల్ అడ్వైజరీ కమిటీ ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ ఎంఆర్ దేశ్ పాండే మాట్లాడుతూ... అసంఘటిత రంగ కార్మికుల వృత్తి నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించడం తద్వారా దేశ ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ప్రతినిధులు కొమ్ము గీతా, గౌనీ నరసింహం గౌడ్, జగదీష్, ఆర్ఏసీ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

'దొత్తివాగుపై బ్రిడ్జి నిర్మించాలి'

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెంబి మండలంలోని దొత్తి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీ శాఖ అడ్డుపడడం ఆపాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆదివాసి గ్రామాల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని, సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అన్నారు. పెంబి మండలంలోని కొన్ని గ్రామాల్లో కరెంటు లేక చీకట్లో జీవితం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో సోనీ, శంభు, ఆనంద్ రావు, విజయ్, ధర్మరాజు, సంతోష్, పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కడ్తాల్ పెద్ద చెరువుకు గండి

సోన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామ పెద్ద చెరువుకు మంగళవారం భారీ గండి పడింది. సోమవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట పెద్ద మొత్తంలో కొట్టుకుపోవడంతో చెరువులోని నీరంతా పంట పొలాల్లోకి ప్రవహించి రైతులకు, మత్స్యకారులకు నష్టం చేకూర్చింది. సమాచారం అందుకున్న అధికారులు చెరువు వద్దకు చేరుకొని గండిని పరిశీలించారు. నీటి ఉధృతి తగ్గిన వెంటనే దాన్ని పూడుస్తామని అధికారులు తెలిపారు.

'ఓజోన్ పొరను కాపాడుకోవాలి'

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవాన్ని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఓజోన్ పొరను కాపాడుతామని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు కే. సూర్య సాగర్ మాటా ఓజోన్ పొరను పరిరక్షించుకునే ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ... ఓజోన్ పొరను రక్షించుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందని, చెట్లను పెంచాలి. ప్లాస్టిక్‌ను తగలపెట్టొద్దని తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ముథోల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల తెలుగు మీడియం పాఠశాల ముథోల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు హిందీ భాషా దినోత్సవ విశిష్టతను, హిందీ భాష కవితలను, ఉపన్యాసాలను, కథలను కనువిందులుగా తెలిపారు. విద్యార్థినులు మంచి లఘు నాటికలను, నృత్యాలను ప్రదర్శించారు.

నేటి నుంచి పోషణ్ అభియాన్ మాసోత్సవం

● మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా కార్యక్రమం
● ప్రాజెక్టుల వారీగా పూర్తయిన అవగాహన సదస్సులు

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణ చేస్తూ ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణమే లక్ష్యంగా ఏటా మహిళా శిశు సంక్షేమ శాఖ 'పోషణ్ అభియాన్ మాసోత్సవం' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం నుంచి అక్టోబరు 16 వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు గాను చర్యలు చేపట్టారు. మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ మెరుగైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించి చైతన్యపర్చనున్నారు. పోషణ్ అభియాన్ మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల వారీగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ జరుగనుంది. నాలుగు వారాల పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకు గాను ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సులు సైతం నిర్వహించి సన్నద్ధం చేశారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పిల్లల పోషణపై సలహా సమావేశం నిర్వహిస్తారు. మహిళలతో పాటు పురుషులకు వంటల పోటీలు నిర్వహిస్తారు. బాలికలు, మహిళలకు బీఎంఐ పరీక్షలు, పిల్లల బరువు, ఎత్తు కొలిచే పోషకాహార ప్రతిజ్ఞలు చేయిస్తారు. స్థానిక ఉత్పత్తుల గురించి అవగాహన కల్పిస్తారు. రెండో వారం బిడ్డకు అందించే ముర్రుపాల విశిష్టత, అనుబంధ ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారపు అలవాట్లపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. పోషణలో తల్లిదండ్రుల భాగస్వామ్యం, బిడ్డ మొదటి వెయ్యి రోజుల్లో మెదడు అభివృద్ధిపై తెలియజేస్తారు. మూడో వారం అతి తీవ్ర పోషణ లోపమున్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహిస్తారు. గ్రోత్ మానిటరింగ్‌లో హాజరుకాని పిల్లల బరువు, ఎత్తులను కొలుస్తారు. పోషణ లోపం ఉన్న పిల్లల ఇళ్లకు ఆశా కార్యకర్తలు వెళ్లి వివరాలను సేకరిస్తారు. నాలుగో వారం మంచినీరు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తక్కువ చక్కెర, నూనెలతో తయారు చేసే వంటకాలను ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తారు. పాఠశాలల్లో వ్యాసరచన, క్రీడా పోటీలు పెట్టి బహుమతులు అందజేస్తారు. గార్డెన్ల ఏర్పాటు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షల నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు.

విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా నియమించిన గ్రామ పాలనాధికారులు (జీపీవో) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తమ విధుల్లో చేరారు. జలంధర్ రాంపూర్, శాంతన్ టెంబుర్ని, రాములు కుస్లీ, సుమలత చాక్‌పల్లి, సుజాత, గోదావరి నర్సాపూర్, నిహారిక నందన్, ముత్తన్న గొల్లమాడ గ్రామాలకు జీపీవోలుగా నియమితులైన వారు తహసీల్దార్ శ్రీకాంత్ వద్ద రిపోర్ట్ చేశారు. గ్రామస్థాయిలో రెవెన్యూ కార్యకలాపాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ఈ నియామకాలను చేపట్టింది. ఈ కొత్త అధికారులు భూ భారతి చట్టం కింద తమ విధులను నిర్వర్తిస్తారు. వీరు ప్రజలకు, ముఖ్యంగా రైతులకు, భూమికి సంబంధించిన సేవలను సులభతరం చేస్తారని భావిస్తున్నారు. ఈ నియామకాల ద్వారా గ్రామ పరిపాలన బలోపేతం అవుతుందని ప్రభుత్వం వెల్లడించింది.

బాధిత కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

● ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యపు సమస్యలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో ఖర్చులు భరించి, చికిత్సలు నిర్వహించుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి బాసటగా నిలుస్తుందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు సొలంకి భీంరావ్, బోస్లే పండిత్‌రావ్ పాటిల్, బీజేవైఎం భైంసా మండల ప్రతినిధి సింధే గంగాప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాన్ని విలీనం చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాలుగు గ్రామాల ప్రజలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కదిలిలోని శ్రీ పాపహరేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ఉన్న నంది అడుగు ఆలయాన్ని పాపహరేశ్వర స్వామి ఆలయంలో విలీనం చేయాలని కోరుతూ కదిలి, మాడెగాం, కుస్లీ, ప్యారమూర్ గ్రామస్థులు మంగళవారం ఆదిలాబాద్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. నంది అడుగు శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి ప్రధాన ఆలయానికి సమీపంలో ఉంటుందని, అయితే నిర్మల్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి నంది అడుగు పక్కనే భూమి కొనుగోలు చేసి బండపై ఉన్న నంది అడుగును కబ్జా చేసి రేకులతో ఆలయాన్ని నిర్మించి తనదిగా చెప్పుకుంటున్నాడని చెప్పారు. నంది అడుగు కదిలి ఆలయానికి సంబంధించినదైనప్పటికీ కబ్జా చేసి తనదిగా చెప్పుకుంటున్నాడని సహాయ కమిషనర్ దృష్టికి తెచ్చారు. వెంటనే కదిలి పాపహరేశ్వరాలయంలో విలీనం చేయాలని నాలుగు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

● తీర్పు వెల్లడించిన జిల్లా న్యాయాధికారి శ్రీవాణి
● నేరం చేసిన వారెవరు శిక్ష నుంచి తప్పించుకోలేరు
● జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 2020లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడైన నిర్మల్ పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన శివాడే మారుతి అనే వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శ్రీవాణి మంగళవారం తీర్పును వెల్లడించారు. ఈ మేరకు ఆ కేసు తాలూకు వివరాలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... 2020 సంవత్సరంలో నిర్మల్‌లోని వైఎస్ఆర్ కాలనీలో శివాడే మారుతి ఓ వివాహిత మహిళ విషయంలో ఆమె రెండవ భర్త కాంబ్లే కిషోర్‌తో గొడవ పడి అతని తలపై పెద్ద బండరాయితో కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అయ్యి కాంబ్లే కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతని భార్య నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మారుతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణలో సంబంధిత సాక్షాలు, ఆధారాలను పరిశీలించిన అనంతరం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శ్రీవాణి మంగళవారం తుది తీర్పును వెల్లడించారు. ఈ తీర్పులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానాను న్యాయాధికారి శ్రీవాణి విధించినట్లు ఎస్పీ జానకి షర్మిల పేర్కొన్నారు. సమాజంలో నేరం చేసిన వారెవరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎస్పీ హెచ్చరించారు. నిర్మల్ పోలీసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ, న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష పడేలా చేస్తారన్నారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకై నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షాధారాలను న్యాయస్థానంలో ప్రవేశపెడుతుందన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు, విచారణ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, ఎస్సైలు కృష్ణ కుమార్, రమేష్, ఏఎస్సై డల్లు సింగ్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ సురేష్‌లను ఎస్పీ అభినందించారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు కృషి

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో వివిధ కుల సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు బాధ్యతాయుతతో కృషిచేస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో లోకేశ్వరం మండలంలోని పంచగుడితో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలవాసులు తమ తమ ప్రాంతాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పాటిల్ మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, లోకేశ్వరం మాజీ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు కోసం ధర్నా

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఇతర పెన్షన్ దారుల పెన్షన్ పెంపు కోసం మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి లక్ష్మణ్ మాట్లాడుతూ... దివ్యాంగులు, వృద్ధులు, ఇతర పెన్షన్ దారుల పెన్షన్ పెంపు నూతన పెన్షన్లు ఏర్పాటు గురించి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాగర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్

తానూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరిక పెన్షన్ అందించాలని తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి. గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం తానూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు రూ. 4016 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పీఎఫ్‌లు ఉండి కూడా పెన్షన్ అందని వారికి ఆన్‌లైన్ ప్రారంభించి అర్హులను గుర్తించి పెన్షన్ అందించాలన్నారు. జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్నారు.

మహిళల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు

● నేటి నుంచి పక్షం రోజుల పాటు



మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డా. ఫిర్దౌస్ జబీన్

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా నారీమణులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మగువలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిద్ధమైంది. బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు అన్ని చోట్ల శిబిరాలు నిర్వహించేందుకు 'స్వాస్థ్ నారీ., సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాలు జరుగనున్నాయి. మంగళవారం కార్యక్రమ నిర్వహణపై జిల్లాలోని వైద్య శాఖ అధికారులు తమ తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై వైద్యాధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. 'స్వాస్థ్ నారీ., సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు పక్షం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు గాను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి సంవత్సరం సెప్టెంబరులో నిర్వహించే 'పోషణ్ మా' కార్యక్రమం కూడా ఈ కార్యక్రమాలతో కలిసి ఈ సారి కొనసాగనుంది. రాష్ట్రంలోని పల్లె దవాఖానాల (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) నుంచి జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రుల పరిధిలోని మహిళలకు ఆరోగ్య పరమైన సేవలు అందించాలనేది 'స్వాస్థ్ నారీ., సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ అయితే వెంటనే తగిన చికిత్స, మందులు అందించనున్నారు. అధిక రక్తపోటు, మధుమేహంతో పాటు వివిధ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేపట్టనున్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుక్త వయసు అమ్మాయిలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. క్షయ బారిన పడే ప్రమాదం ఉన్న మహిళలను గుర్తించి టీబీ పరీక్షలు చేయనున్నారు. వైద్య కళాశాలల్లో పని చేసే గైనకాలజీ, నేత్ర, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, డెంటల్ సర్జన్ తదితర వైద్యులు శిబిరాల్లో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తారు.వివిధ వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేపట్టనున్నారు.

కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి.

డా. ఆకాష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, భైంసా

ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వాస్థ్ నారీ., సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాం. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహిస్తాం. మహిళలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సేవలు అందిస్తాం.

సొంత నిధులతో రోడ్లకు మరమ్మతులు



మెరుగైన రోడ్డు

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 4వ వార్డులో గల శివాజీ నగర్‌లో గల పలు అంతర్గత రోడ్లు భారీ వర్షాల మూలంగా దెబ్బతిని అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. కాలనీవాసుల సమస్యను పరిష్కరించేందుకు గాను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్ ఔదార్యతతో వ్యవహరించారు. స్వంత నిధులను వెచ్చించి శివాజీ నగర్ కాలనీ పరిధిలో మరమ్మతులు చేయించారు. శ్రమదానం నిర్వహించి మురికి నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టారు.

వడ్యాల్‌లో ట్రాక్టర్ పట్టివేత

లక్ష్మణచాంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్యాల్ సమీపంలోని వాగులో అక్రమంగా ఇసుకతీస్తున్న మిషన్‌ను, ట్రాక్టర్‌ను రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను తీస్తూ, తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ముందస్తు సమాచారంతో అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు వారు వెల్లడించారు. వీటిని సీజ్ చేసి పోలీసు కస్టడీకి అప్పగించినట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుళ్లు గణేష్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

భైంసా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న పంటలకు కాలయాపనకు తావు లేకుండా వెంటనే నష్టపరిహారం అందించి బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కొమ్రేవార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించి వారం రోజులకు పైగా కాలం గడిచినప్పటికీ నష్టపరిహారం అందించే విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇందులో బీఆర్ఎస్ కుంటాల మండల అధ్యక్షులు పడకంటి దత్తు, కుభీర్ మండల మాజీ ఎంపీటీసీ దేవిదాస్, బీఆర్ఎస్ యువజన విభాగం ప్రతినిధి సంజీవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్పీహెచ్ఎస్ రత్నాపూర్ కాండ్లీ పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించినట్లు సైన్స్ ఉపాధ్యాయులు వసంత, నవ్యలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి, ఓజోన్ పొర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రత్యేక మత్స్య సహకార సొసైటీని వ్యతిరేకిస్తూ నిరసన



ఆందోళన చేస్తున్న పీచర గ్రామస్థులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పీచర గ్రామానికి ప్రత్యేక మత్స్య సహకార సొసైటీని వ్యతిరేకిస్తూ మంగళవారం గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీచర గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు గ్రామానికి ప్రత్యేక మత్స్య సహకార సొసైటీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సొసైటీ ఏర్పాటు ద్వారా గ్రామంలో కలిసి ఉన్న గ్రామస్థుల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగురవేసిన గోపి గంగన్న

లక్ష్మణచాంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉధృతంగా ఉద్యమం సాగుతున్న రోజులవి. అప్పటి ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం జరుపకుండా నిరోధిస్తున్న సమయంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు గోపి గంగన్న పోలీసులకు, లాఠీ దెబ్బలకు భయపడకుండా తహసీల్దార్ కార్యాలయం పైన జాతీయ జెండా ఎగురవేసి తన ఉద్యమ స్ఫూర్తిని తెలంగాణ ఏర్పాటు కాంక్షను నొక్కి చెప్పారు. అప్పటి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇచ్చిన పిలుపు మేరకు 2012 లోను 2013 లోను జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా గోపి గంగన్నపై కేసులు కొనసాగుతుండటం గమనార్హం.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ తెలంగాణ విమోచన దినోత్సవ పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఎన్ని మారినా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం దురదృష్టకరమని అన్నారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో రేపు జాతీయ జెండాలు ఎగురవేస్తామని తెలిపారు.

'కుంటను కలుషితం కాకుండా కాపాడండి'

ఖానాపూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతి నగర్ కాలనీలో గల బొడ్డోని కుంటలో నీరు కలుషితం కాకుండా కాపాడాలని శాంతినగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కుంట వద్ద ఆయా పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుంటలో నీరు దుర్వాసన వెదజల్లుతోందని ముక్కు మూసుకొని నిరసన వ్యక్తం చేశారు. పట్టణానికి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ భర్త ఈ కుంటను కలుషితం చేసేందుకు ప్రధాన కారణం అవుతున్నారని ఆరోపించారు. కుంట వద్ద రాజకీయం చేయడం తగదన్నారు. ఈ కుంట కలుషితం చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని మురుగు నీటితో పాటు సమీపంలోని గోవధ శాల నుండి వ్యర్థాలను కుంటలో చేరేలా సదరు నాయకుడు చేస్తున్న చర్యలు సరికావన్నారు. వెంటనే అధికారులు స్పందించి కుంటలో నీరు కలుషితం అవ్వకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాలనీ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మదిరె సత్యనారాయణ, ల్యాండరీ రమేష్, కోమటిపల్లి గోపి, రాజేందర్, అబ్బాస్, రాజేందర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తల్వేదలో ఉచిత కంటి వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తల్వేద గ్రామంలో ఈర్ల జంగన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రాంరెడ్డి ఐకేర్ సహకారంతో వైద్యులు గ్రామస్థులకు ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కంటి వైద్యులు గ్రామస్థులను పరీక్షించి టీకాలు, అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం వైద్య బృందాన్ని శాలువాతో సత్కరించారు.

'మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

కుభీర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమెల్యేపై ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రం కుభీర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పది సంవత్సరాలు ఏ పని కూడా చేయలేదని అనడాన్ని ఖండిస్తున్నామన్నారు. దాదాపు కుభీర్ మండలంలో సుమారు 25దేవాలయాలకు, కల్యాణ మండపాలకు నిధులు మంజూరు చేయించారని, అన్ని కుల సంఘాల భవనాలకు నిధులు కూడా మంజూరు చేయించారన్నారు. మండల కేంద్రంలో గ్రంథాలయం, మార్కెట్ కమిటీలు సీసీరోడ్లు నిర్మాణం, పల్సి గ్రామంలో గోదాముల నిర్మాణాలు చేయించారని అన్నారు. పనికట్టుకొని మా నాయకున్ని విమర్శిస్తే ఊరుకోమని, మీ నాయకుడు గెలిచి 22నెలలు గడిచినా నియోజక వర్గంలో చాలా పనులు ఇంకా అలానే ఉన్నవని, ఇలా చెప్పుకుంటూ పోతే చాల ఉన్నవి, ఇలాంటి దుష్ప్రచారాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోనె కళ్యాణ్, వైస్ చైర్మన్ హైమ్మద్, మాజీ పీటీసీ శంకర్ చవాన్, మాజీ చైర్మన్ దొంతుల రాములు, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్, పీఏసీఎస్ మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ ఎంపీటీసీ నాగలింగం, మాజీ సర్పంచ్ బంక ఆనంద్, నాయకులు అరుణ్ రాజాసింగ్, ప్రహ్లాద్, సత్యనారాయణ, వెంకటేశ్, సురేష్, గంగాధర్, పార్డి గంగయ్య, మిలింద్, సూది రాజన్న, కందూర్ సాయినాథ్, మల్లేష్‌యాదవ్, సాహెబ్‌రావు, బోడిగం సాయినాథ్, వడ్ల దత్తాత్రి, దొంతుల మహేష్, పోగు లింగన్న, తానూర్ అంజయ్య, మండల కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



బజార్‌హత్నూర్ శివారులో పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు



బజార్‌హత్నూర్‌లో వర్షాలకు జౌకుపట్టి ఎర్రబారిన పత్తి పంట

పత్తి ఎర్ర బారుతోంది!!

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నండటంతో పంటలు చేతికందుతాయో? లేదనే? సంధిగ్ధంలో ఉన్నారు. రైతాంగం ఇప్పటికే చేన్లలో జౌకుపట్టి పత్తి పంట ఎర్రబారుతోంది. దీంతో ఎరువులు వేసి కలుపు తీసేందుకు కూడా వర్షం తెరిపినివ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం మండలంలో మోస్తరు కురిసిన వర్షానికి రైతుల చేలల్లో నీరు నిలవగా, మరో చేనులో ఎర్రబారిన పత్తి కనిపించింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా మెడికల్ షాపుల నిర్వహణ

● గ్రామాలలో అడ్డగోలుగా దోపిడీ ● అవసరం కనుక.. నోరు మెదపని కొనుగోలుదారులు

బోథ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ పరిధిలోని మెడికల్ షాపుల నిర్మాణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు జిల్లా అధికారులు గుర్తించారు. అయితే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న మూడు మెడికల్ షాప్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి మెడికల్ షాప్‌ల నిర్వహణపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో తనిఖీలను నిర్వహించారు. అయితే తనిఖీలలో అక్రమ వ్యాపారం దందా బట్టబయలైంది.



ఇటీవల సోనాల మండల కేంద్రంలో మెడికల్ షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)

మందుల నిల్వలో నిర్లక్ష్యం

మెడికల్ షాప్‌లో మందుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అధికారుల తనిఖీల్లో వెల్లడయ్యాయి. వాస్తవానికి మెడికల్ షాపులలో మందులను దూళి పడకుండా గ్లాస్ అలు మారాలలో భద్రపరచాల్సి ఉంది. అయితే పల్లెల్లోని మెడికల్ షాపుల నిర్వాహకులు గ్లాస్ ఫిట్టింగ్ లేకుండానే నిర్లక్ష్యంగా మందులను నిల్వ ఉంచుతున్నట్లు అధికారుల విచారణలో తేలింది. అంతేగాక కొన్ని రకాల మందులను ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచాల్సి ఉండగా అవసరానికి తగ్గట్టుగా ఫ్రిజ్లు లేకపోగా గంటల తరబడి విద్యుత్ కోతలతో మందులు చెడిపోతున్నాయని అధికారులు గుర్తించారు. మరోవైపు మెడికల్ షాపుల నిర్వాహకులు ఇష్టానుసారంగా ధరలు వేసి విక్రయాలు జరుపుతున్నట్లు అధికారులు గుర్తించారు.

బిల్లులు లేకుండానే...

నియోజకవర్గ పరిధిలోని అనేక మెడికల్ షాప్‌లో యజమాను ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా మందులను విక్రయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మందులు విక్రయించిన సందర్భంలో వినియోగదారులకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. మందుల కొనుగోలుదారులకు సరైన న్యాయం జరగాలంటే బిల్లుల రసీదులు ఇవ్వాల్సిన అవసరం ఉందని వినియోగదారులు అంటున్నారు.

వారే డాక్టర్లు.. వారివే మెడికల్ షాపులు

నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలు గ్రామాలలో కొంతమంది వైద్యులతో పాటు ఆర్ఎంపీలు వైద్యంతో పాటు మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారు. వారి వారి మెడికల్ షాపుల్లో అడ్డదారుల్లో దోచుకునేందుకు అవసరం లేని మందులను రోగులకు అంటగడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి ఆర్ఎంపీ వైద్యులకు గ్లూకోస్ బాటిల్స్ ఇంజక్షన్లు ఇచ్చే అధికారం లేకుండా ఇష్టానుసారంగా ఆర్ఎంపీలు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వైద్యుల మెడికల్ షాపుల పైన జిల్లా స్థాయి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మారుమూల గ్రామాలకు వెళ్లి ఏ రోజు కూడా మెడికల్ షాప్‌లను తనిఖీలు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఏదేమైనా జిల్లా అధికారులు మెడికల్ షాపుల నిర్వహణపై పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిందే.

పార్టీ బలోపేతం దిశగా.. అడుగులు

(5వ పేజీ తరువాయి...)

పనేమీ కాదంటున్నారు. సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల హామీలు, యూరియా కొరత లాంటి ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో కొంత వరకు కలిసి వచ్చే అవకాశం ఉన్న ఎన్నికల్లో నేతలంతా కలిసి పని చేస్తారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ టికెట్ల కేటాయింపు అభ్యర్థుల ఎంపికలో నేతల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించి ముందుకెళ్లడం కాంగ్రెస్ పార్టీలో అంతసులువైన పనేమీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఇన్‌చార్జి నిర్ణయమే ఫైనల్

ప్రభుత్వ పథకాలు, నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల మంజూరు విషయంలో నియోజకవర్గ ఇన్‌చార్జీల నిర్ణయమే ఫైనల్‌గా కనిపిస్తుంది. ఇన్నాళ్లు ఆదిలాబాద్ నియోజకవర్గంలో కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నీ తానై పార్టీని ముందుకు నడిపించారు. ఇకపై అలాంటి పరిస్థితులు ఉంటాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజక వర్గాల్లో పార్టీ ఇన్‌చార్జీల నిర్ణయమే ఫైనల్ అంటూ పలుమార్లు పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన పరిస్థితులు ఉన్నాయి. ఇకపై ముగ్గురు సీనియర్ నేతలు కూడా నియోజకవర్గ ఇన్‌చార్జీతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఇది వరకు ఉన్న విభేదాలను పక్కన పెట్టి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ముందుకు వెళ్తారా? లేదా? గతంలో మాదిరిగానే కందికి దూరంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తారా? అనే దానిపై ఇంకా స్పష్టత కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఇరువర్గాల నేతలు స్పష్టమైన ప్రకటనలు చేయక పోవడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి.



ఉప్పొంగి ప్రవహిస్తున్న నక్కలవాడ వాగు

బోథ్‌లో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి...)

మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కారణంగా ఉప్పొంగి ప్రవహించింది. వాగు పై భాగంలో భారీ వర్షం పడడంతో ఉధృతంగా ప్రవహించింది. అయితే నక్కల వాడ సమీపంలో వర్షం లేకపోవడంతో పొలం పనులకు వెళ్లిన వారు తిరిగి వస్తుండగా పొంగి ప్రవహిస్తున్న వాగును చూసి ఎక్కడి వారు అక్కడే నిలిచిపోయారు. వాగు పొంగి ప్రవహించడంతో దాదాపు ఆరు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.



మరలపల్లి గ్రామంలో భారీ వర్షానికి కూలిన ఇల్లు



షబ్బీర్‌అలీకి స్వాగతం పలుకుతున్న కంది శ్రీనివాస రెడ్డి

షబ్బీర్‌అలీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ మైనార్టీల శాఖల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆదిలాబాద్ కు చేరుకున్నారు. స్థానిక పెన్ గంగా అతిథి గృహం వద్ద కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయనకు స్వాగతం పాలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

డబుల్ గేమ్ ఆడుతున్న ప్రతిపక్షాలు : ఎంపీ

ఇచ్చోడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నాడు జీఎస్టీ స్లాబ్ తగ్గించాలని డిమాండ్ చేసిన ప్రతిపక్షాలు ప్రస్తుతం తమ ఆదాయం తగ్గుతుందని డబుల్ గేమ్ ఆడుతున్నారని ప్రతిపక్షాలపై ఎంపీ గోడం నగేష్ ఆరోపించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువుల నుంచి కార్ల వరకు జీఎస్టీ తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాన అన్ని రష్టాల ఆర్థిక మంత్రుల సభ్యులతో కూడిన కౌన్సిల్ తీసుకోచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్ పూర్తిగా తగ్గించడంతో ధరలు తగ్గుముఖం పట్టనున్నాయని స్పష్టం చేశారు. ఈనెల 22 నుంచి జీఎస్టీ అమలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. సెప్టెంబరు 17న విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ప్రధానికి జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఇందులో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజు, మండల కన్వీనర్ తహరె రమేష్, నాయకులు కొల్లూరి శేఖర్, గుమ్మడి భీంరెడ్డి, మాధవ్‌రావ్, దుర్రె దామోదర్, నారాయణ, జాదవ్ రాము, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'రక్తహీనత రాకుండా చూడాలి'

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బాలికలలో రక్తహీనత రాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు చూడాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్ ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డిను కోరారు మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తి స్త్రీ శిశు వికలాంగులు సీనియర్ సిటిజన్స్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళలలో రక్తహీనత రాకుండా చూసుకోవాల్సిన పలు అంశాలపై వివరించారు. పోషణ మాస శిక్షణను పురస్కరించుకొని ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ మంజుల, ప్రమీల, విమల, శారద, తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలు నమోదు చేసుకోవాలి

తలమడుగు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలో పంటలు సాగు చేస్తున్న రైతులు తమ పంటల వివరాలు తప్పకుండా నమోదు చేసుకోవాలని తలమడుగు క్లస్టర్ ఏఈవో స్ఫూర్తి కోరారు. మంగళవారం తలమడుగులో పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పంటలు నమోదు చేసుకున్న రైతులు ఏ పంట సాగు చేస్తున్నారో వాటి వివరాలు పట్టా పాస్ బుక్, ఆధార్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాసుబుక్‌తో నమోదు చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో పంటలు విక్రయించుకునే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని వారికి సూచించారు. అంతేకాకుండా రైతుల పంట పొలాల్లోకి వెళ్లి పంటలను నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందులో సీఈవో మోతే శ్రీనివాస్, రైతులు నరేందర్ రెడ్డి, భూమయ్య, ఆశారెడ్డి, ప్రేమేందర్, తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో పంటలను నమోదు చేస్తున్న ఏఈవో స్ఫూర్తి

అవే బారులు.. అదే బాధలు!!

● యూరియా కోసం రైతులకు తిప్పలే తిప్పలు



బేలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



బేల సొసైటీ వద్ద యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ యేడు వానాకాలం సీజన్ ముగిసి పోతున్న రైతులకు యూరియా తిప్పలు మాత్రం తప్పడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఎటు చూసినా యూరియా బారులే కనిపిస్తున్నాయి.ఉదయం నుంచే రైతులు సొసైటీల వద్ద బారులు తీరి యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఒక్కొక్క రైతుకు ఒకటి రెండు బస్తాలను మాత్రమే ఇవ్వడంతో కొంత మంది రైతులు కుటుంబమంతా క్యూలైన్‌లో నిలబడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వానాకాలం సీజన్‌లో 36 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 31వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే జిల్లాకు సరఫరా అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి, సోయా పంటలు కాయదశలో కనిపిస్తున్నాయి. దీంతో సకాలంలో ఎరువులు వేయకుంటే ఆశించిన దిగుబడులు రావని రైతులు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం నుంచే సరఫరా లేక పోవడంతో తీవ్రమైన యూరియా కొరత ఏర్పడుతుంది. రైతులంతా ఒకేసారి గుంపులు గుంపులుగా యూరియా కోసం రావడంతో ముందు జాగ్రత్తగా అధికారులు పోలీసు భద్రత నడుమా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని మండలాల్లో అధికారులు, పోలీసులతో రైతులు వాగ్వివాదానికి దిగుతున్నారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడే ఓపిక లేక కొంత మంది వృద్దులు, మహిళలు పాస్‌బుక్‌లు, చెప్పులను వరుస క్రమంలో పెట్టి ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం నుంచే సరిపడా యూరియా సరఫరా కావడం లేదని చెబుతూ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు

● తెలంగాణ చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్

నేరడిగొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని దేశంలో ఏదో ఒకచోట పసిమొగ్గలపై లైంగిక దాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. ఇంటా, బయటా పిల్లలపై లైంగిక వేధింపులు, భౌతిక దాడులు పెరుగుతున్నాయని దాంతో మానసికంగా, శారీరకం గా ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ సభ్యురాలు ప్రమీల అగర్వాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని లకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా? లేదా? విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు మన జాతి సంపద అని బాల్యంలోని మధురానుభూతు లు అందించే వాతావరణం కల్పించాలన్నారు. పిల్లల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని అన్నారు. పాఠశాలలో అకతాయిల వేధింపులుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ చైల్డ్ రైట్ ప్రొటెక్షన్ అధికారి, జీసీడీవో ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి తిరుపతి, ఎంఈఓ భూమారెడ్డి, కేజీబీవీ స్పెషల్ అధికారి రజిత, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.



కేజీబీవీ పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ప్రమీల అగర్వాల్

విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగాలి

● ఉమ్మడి జిల్లా క్రీడల శాఖ అధికారి పార్థసారథి ● దేవాపూర్ పాఠశాలలో జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

తలమడుగు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు ఆట పోటీల్లో రాణిస్తూ లక్ష సాధనతో ముందుకు వెళ్లాలని ఉమ్మడి జిల్లా గిరిజనుల క్రీడా శాఖ అధికారి పార్థసారథి కోరారు. మంగళవారం మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 17 బాల బాలికల ఖోఖో పోటీల విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.

అదేవిధంగా క్రీడలతో స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడతాయన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జోనల్ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసయ్య, మండల విద్యాధికారి వెంకట్రావు, ఉపాధ్యాయులు దిలీప్ రెడ్డి, క్రీడ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుర కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా 4వ మహాసభలు మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగాయి. మహాసభలకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగం రాజమల్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో పని చేయాలి : ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో రమేష్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాల్సి ఉందన్నారు.

'ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుంటాం'

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలు ఖాళీగా ఉన్నాయని అయితే వాటిని ఖాళీ స్థలాల యజమానులు స్థలాలను శుభ్రం చేసి అందులో ఇండ్ల నిర్మాణం చేపట్టుకోవాలని లేకుంటే ప్రభుత్వా నిబంధన ప్రకారం ఇంటి స్థలాలను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని గ్రామపంచాయతీ ఈవో అంజయ్య తెలిపారు. గతంలో ఖాళీ స్థలాలను శుభ్రం చేసుకోవాలని సూచించడం జరిగిందని అయినా కొంతమంది నిర్లక్ష్యంగా వారిస్తున్నారు. వారం రోజులు వేచి చూసి ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. కాగా సాయినగర్ కాలనీలో ఖాళీ స్థలాలు ఉన్నవారు బోథ్ మండల కేంద్రంలో ఇళ్లు ఉన్నాయని అంతేగాక కొంతమంది ఇంటి స్థలాలను అమ్ముకున్నారని తెలుస్తుంది. దీంతో తమ ఖాళీ స్థలాలు అలాగే ఉంచడంతో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మున్నూరుకాపులు అన్నిరంగాల్లో ఎదగాలి

ఇచ్చోడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు కులస్థులు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా గ్రంథాలయ సంస చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. ఇచ్చోడ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు వ్యవసాయం, విద్య, రాజకీయం, ఉపాధి, వ్యాపారంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఇచ్చోడలో సంఘ భవన నిర్మాణానికి కృషిచేయాలని కమిటీ సభ్యులు ఆయనకు విన్నవించారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్నూర్ గ్రామంలోని ఎస్టీ కాలనీలో చిన్నారిపై మంగళవారం సాయంత్రం కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాల పాలైన చిన్నారిని బోథ్ ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకురావడం జరిగింది.

ఆవులను తరలిస్తూ పట్టుబడిన లారీ

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని ఘన్పూర్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా మహారాష్ట్ర వైపు తరలిస్తున్న 33 ఆవులతో వెళుతున్న కంటైనర్ లారీని స్థానిక ఎస్సై శ్రీసాయి పట్టుకోవడం జరిగింది. ఆవులను తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో ఎస్సై ఆయన సిబ్బందితో కలిసి ఘన్పూర్ చెక్‌పోస్టు వద్దకు వెళ్లి లారీని స్వాధీనం చేసుకున్నారు. అయితే లారీ డ్రైవర్ మాత్రం పరారయ్యారు. పట్టుబడిన ఇచ్చోడాలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు. కాగా తరలిస్తున్న వాహనంలో ఒక ఆవు మృతి చెందినట్లు సమాచారం.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక

తాంసి రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తాంసి మండలం ఆర్యవైశ్య సంఘం కమిటీని మంగళవారం తాంసి మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా నార్ల పండరినాథ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మొదటి సారిగా ఈ కమిటీ ఎన్నిక జరిగింది.

వీడీసీల ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధం

● వీడీసీల అక్రమాలపై 16 కేసులు : ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి కమిటీలు ప్రజలకు భారంగా, ప్రజల వద్ద న్యాయస్థానాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించకుండా గ్రామాభివృద్ధి పేరుతో వసూలు చేయడం చట్ట వ్యతిరేకమని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. గ్రామాభివృద్ధి పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారంగా కేసులు నమోదు చేయబడతాయని, అందులో భాగంగానే ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో ఇప్పటివరకు 16 కేసులను నమోదు చేశామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను, కల్లు దుకాణాలను, ఇసుక తవ్వకాలకు అనధికారికంగా అనుమతులు ఇవ్వడంపై వీడీసీలకు అర్హతలు లేవని స్పష్టం చేశారు. వారి అనుమతితో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్వహించే వారిపై, వీడీసీలపై కేసులు నమోదు చేస్తాని హెచ్చరించారు. వీడీసీల అక్రమాలపై జైనథ్ సర్కిల్ పరిధిలో పది కేసులు, బోథ్ సర్కిల్ పరిధిలో 2, ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో 4కేసులో నమోదు చేసినట్లు వెల్లడించారు. తాజాగా మంగళవారం జైనథ్ మండలం ఆనందపూర్ గ్రామానికి చెందిన 8మందిపై కేసు నమోదు చేశామని, ఇసుక వేలంపాటకు ప్రయత్నించడం కారణంగానే వీరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వడ్డీ వ్యాపారి వేధింపులకు ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారి వేధింపులతో ఒకరు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో జరిగింది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. బుద్దానగర్‌కు చెందిన దహికాంబ్లే రాము(40) మండలకేంద్రంలోని సైకిల్, మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 10న పని ముగించుకుని పురుగుల మందు తాగి వాంతులు చేస్తూ ఇంటికి వెళ్లాడు. గమనించిన భార్య ఏమైందని అడిగితే నేను వ్యాపారం నిమిత్తం 30.06.2025లో జవవహర్‌లాల్ అనే వడ్డీ వ్యాపారి వద్ద నుంచి రూ.20 వేలు అప్పు తీసుకున్నానని, ప్రతీ వారం రూ.1500 చొప్పున ఫైనాన్స్ కడుతున్నానని, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూడు వారాలుగా ఫైనాన్స్ డబ్బులు కట్టకపోవడంతో ఈనెల 10న జవహర్‌లాల్ అనే వడ్డి వ్యాపారి దుకాణానికి వచ్చి అందరిముందు ఇష్టారీతిన తిట్టడంతో పాటు కులం పేరుతో బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేశాడని, దీంతో పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, 108 అంబులెన్స్‌తో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఫైనాన్స్ వ్యాపారిపై ఎలాంటి కేసు నమోదు చేయకపోవడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, పరిస్థితి విషమించి మంగళవారం రాము మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంఘమిత్రతో పాటు ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. బుద్దానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయమై స్థానిక ఎస్సై సాయన్నకు సంప్రదించగా.. ఈనెల 10న కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, విచారణ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన వివరించారు.

పర్యాటక శాఖ దినోత్సవం సందర్భంగా పోటీలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే పోటీల్లో పాల్గొనే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 18న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా కేంద్రంలోని గుజిటిడ్ నెం.1 పాఠశాలలో ఉదయం 10గంటలకు పోటీలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గడువులోగా హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జెండావిష్కరణకు ఏర్పాట్లు



అతిథుల కోసం ఏర్పాటు చేసిన షామియానాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిపేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం జరగనున్న కార్యక్రమ ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం స్థానికంగా నిర్వహించనున్న పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడంలో నిమగ్నమయ్యారు.

నానో యూరియాపై అన్నదాతలకు అవగాహన

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పిరి గ్రామ రైతు వేదికలో మంగళవారం నానో యూరియా, నానో డీఏపీలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుళికల రూపంలో ఉన్న యూరియా కంటే ద్రావణ రూపంలోని డీఏపీ, యూరియా ఉపయోగంగా ఉంటుందని వ్యవసాయ విస్తరణ అధికారి క్రిష్ణపాల్, ఇఫ్కో కంపెనీ సిబ్బంది అరవింద్‌లు తెలిపారు. ఇది పర్యావరణహితమైనదని, నేల నుంచి పోషకాలను సమృద్ధిగా వినియోగించి దిగుబడికి దోహదపడుతుందన్నారు. సంప్రదాయ యూరియా బదులు నానో యూరియా డీఏపీ ద్రావణాన్ని తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఇందులో రైతులు వినయ్, రాకేష్, సుధాకర్, గంగారాం, శ్రీకాంత్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

30వరకు ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్‌లు

మావల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ, ఆర్ఐటీఐ, మైనారిటీ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన మిగిలిన ఖాళీ సీట్లకు వాక్ ఇన్ అడ్మిషన్లు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట లోపు తాము ఆసక్తి ఉన్న ఐటీఐ/ఏటీసీలకు హాజరై, తమ సర్టిఫికెట్‌లతో అటు ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాన్ని సమర్పించాలన్నారు. అంతకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే మొదటి నుంచి మూడు దశలలో దరఖాస్తు చేసుకున్న వారు సైతం ఈ వాక్ ఇన్ అడ్మిషన్‌లో పాల్గొనవచ్చన్నారు. కాగా సీట్లు ప్రతీరోజు అందుబాటులో ఉన్న మేరకు నవీకరించబడతామని మెరిట్ ఆధారంగా రోజు వారి కేటాయింపు జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి అప్లికేషన్ కోసం https://iti.telanana.gov.in, అలాగే https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగియక ముందే 30వ తేదీలోపు అడ్మిషన్లను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు.



పార్టీ బలోపేతం దిశగా.. అడుగులు

2023 అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి వ్యతిరేకంగా పని చేసిన ముగ్గురు సీనియర్ నేతలపై కాంగ్రెస్ యూటర్న్ తీసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఆదేశాలను దిక్కరించడంతో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, సీనియర్ నేత సంజీవ్‌రెడ్డిలపై పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఈ ముగ్గురు నేతలు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఈ ముగ్గురు నేతలను దూరంగానే పెట్టింది. అయినా ఇతర పార్టీల్లోకి వెళ్లకుండా కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు కోసం ఓపికగా ఎదురుచూస్తూ వచ్చారు. ఎట్టకేలకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సీనియర్ నేతల పై సస్పెన్షన్ వేటు ఎత్తివేసి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు.

- జిల్లాలో సీనియర్ నేతలపై సస్పెన్షన్ ఎత్తివేసిన అధిష్ఠానం
- సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డిలకు మళ్లీ రీఎంట్రీ
- కండువా వేసి ఆహ్వానించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్
- ఆదిలాబాద్ నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో మంత్రులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు జిల్లాలో పర్యటించిన సందర్భంగా మాజీ మంత్రి రాంచందర్‌రెడ్డి ఇంటికి వెళ్లడం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. అప్పటి నుంచే తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఇన్నాళ్లు సీనియర్ నేతల చేరికను తీవ్రంగా వ్యతిరేకించిన ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వర్గం.. ప్రస్తుతం సైలెంట్‌ైనట్లుగానే కనిపిస్తుంది. అంతేకాకుండా పార్టీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం అందరినీ

కాంగ్రెస్‌లో యూటర్న్...

కలుపుకొని ముందుకెళ్లే విధంగా కంది శ్రీనివాస్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

చేతులు కలిసేనా?!

గత అసెంబ్లీ ఎన్నికల్లో చివరి వరకు టికెట్‌ను ఆశించి దక్కక పోవడం తో తీవ్ర మనస్తాపంతో కాంగ్రెస్ పార్టీ ఆదేశాలను పక్కన పెట్టిన సీనియర్ నేతలు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో కొనసాగనున్నారు. అయితే కాంగ్రెస్ లో సీనియర్, జూనియర్‌లు కలిసి పని చేయడం కొంత కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ బాధ్యతలను భుజాన వేసుకుని ముందుకు నడిపిస్తున్న నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డితో సీనియర్ నేతలు కలిసి పని చేస్తారా? లేదా? ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నేతలంతా కలిసికట్టుగా పని చేస్తేనే పార్టీకి విజయ అవకాశాలు ఉంటాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.వర్గ విభేదాలు లేకుండా కార్యకర్తలను కలుపుకుని ముందుకెళ్తేనే పార్టీ మరింత బలపడే అవకాశం ఉందంటున్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కొంత బలంగానే కనిపిస్తున్నాయి. ఈ రెండు పార్టీలకు దీటుగా ముందుకెళ్తేనే అధికార పార్టీ పట్టు నిలుపుకునే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

స్థానిక ఎన్నికలు సవాలే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సారి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఆ పార్టీ నేతలకు పెద్ద సవాల్‌గానే మారనున్నా యి. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొంత అనుకూలమైన వాతావరణం కనిపించడం లేదు. బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే కొనసాగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ విజయం సాధించడం అంతసులువైన

తరువాయి 7వ పేజీలో....





అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, తదితర అంశాలపై పరిస్థితిని సమీక్షించేందుకు మంగళవారం కలెక్టర్ రాజర్షిషా మున్సిపాలిటీ, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదల ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణంగా పరిష్కరించేందుకు తాత్కాలిక, శాశ్వత చర్యలపై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు. ముఖ్యంగా మావల చిన్న చెరువు, ఖానాపూర్ ట్యాంక్ నుంచి నీరు మితిమీరి ప్రవహించిన కారణంగా ఏర్పడిన సమస్యలను కలెక్టర్ సవివరంగా అడిగి తెలుసుకున్నారు. నీటిపారుదల, మున్సిపాలిటీ శాఖల అధికారులు సంయుక్తంగా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు కలెక్టర్‌కు సమస్యలను వివరించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఇరిగేషన్ అధికారి విఠల్ పాల్గొన్నారు.

సైబర్ బాధితుడికి పది రోజుల్లో నగదు



ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న రాథోడ్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాథోడ్ గత సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి తన అకౌంట్‌లోకి రావాల్సిన రూ.41,800 వేరే అకౌంట్‌లోకి వెళ్లాయని ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ బృందానికి బాధితునికి తిరిగి రావాల్సిన డబ్బుల గురించి సూచనలు చేయగా.. కడప సైబర్ క్రైమ్ బృందానికి సంప్రదించి తన అకౌంట్‌లోకి రావాల్సిన డబ్బులను తిరిగి వచ్చే విధంగా కృషి చేశారు. ఈ సందర్భంగా బాధితుడు రాథోడ్ సునీల్ ఎస్పీతో పాటు సైబర్ క్రైమ్‌పై స్పందించి వెంటనే తనకు న్యాయం చేసిన జిల్లా పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ పి.గోపి కృష్ణ, సిబ్బంది రియాజ్, త్రిశూల్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలి : జిల్లా అధ్యక్షుడు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీవిశ్వకర్మ ఆరాధనోత్సవాలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం నేతలు తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని ఈనెల 17, 18వ తేదీల్లో జరగనున్న కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 18న పట్టణంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు సామన్పెల్లి నర్సిములు, మీసాల స్వామి, దశరథ్, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘం ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా జరుపనున్నట్లు సంఘం అధ్యక్షుడు జాన్వి సంతోష్ తెలిపారు. శ్రీగోపాలకృష్ణ మఠంలో చేపట్టనున్న కార్యక్రమానన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి : లింగా గౌడ్

ఉట్నూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.. కానీ మాట తప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండవ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపతి లింగాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం వెనుకున్న చరిత్ర ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వారి పాలన అంతమై భారత దేశమంతటా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నారని, కానీ దేశం నడిబొడ్డున ఉన్నా హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలకు ఆ అదృష్టం లేకుండా పోయిందన్నారు. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 1948 సెప్టెంబరు 17న నిజాం నవాబు లొంగుబాటుతో తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



హిందీ కరదీపికలను ఆవిష్కరిస్తున్న ఎంపీ

జాతీయ భాష హిందీ దేశాన్ని ఏకం చేసింది : ఎంపీ గోడం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ భాష హిందీ దేశాన్ని ఏకతాటిపై తీసుకొచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించి జాతీయ సమైక్యతకు తోడ్పడిన భాష అని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన హిందీ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించాం. హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పులాజీబాబా బోధనలపై సుకుమార్ పెట్కులే రాసిన ఒక్క వంద ఎనిమిది దోహేల హిందీ, తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత హిందీ లెక్చరర్ సురేష్‌సింగ్‌ను, జిల్లా, మండల స్థాయి అవార్డులు గ్రహీతలను సన్మానించారు. అదేవిధంగా హిందీ కర దీపిక తయారు చేయడంలో సహకరించిన డీఆర్పీలను సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

బజార్‌హత్నూర్: ఇటీవల మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు వర్ని సంతోష్ తండ్రి నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఘనంగా హిందీ దివస్

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు గణేష్ హిందీ యొక్క గొప్పతనంగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు హిందీ భాష గురించిన కవిత్వాలు వివరించారు. ప్రిన్సిపాల్ ధనరాజ్ హిందీ భాష యొక్క ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఇందులో అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, సువర్ణ, శ్రీలత, వినోద్, ఎన్ఎస్ఎస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, తిరుపతి, దత్తు, నీలోఫర్, రానా, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో ఉద్యోగులు.. విద్యార్థులకు ఇక్కట్లు

- ఉట్నూర్‌లో రెండవ రోజుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె
- ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో తప్పని తిప్పలు



చితగూడలో ఊడుస్తూ.. కూరగాయలు కోస్తూ.. చింతపండు పితుకుతూ.. మధ్యాహ్న భోజనం వండుతున్న బాలికలు

ఉట్నూర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండవ రోజుకు చేరింది. ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయం ముందు తెలంగాణ గిరిజన సంక్షేమ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో క్యాటరింగ్ విధానం కోసం తెచ్చిన జీవో 527 రద్దు చేయాలని, ప్రభుత్వ జీవో 60 ప్రతీనెల రూ.15,600 వేతనం ఇవ్వాలని, అవుటట్ సోర్సింగ్ ఉద్యోగుల, దినసరి ఉద్యోగులకు చెందిన 10 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకరు గుర్తింపు కార్డులు, రెండు జతల దుస్తులు, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, తపాల శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన రూ.10లక్షల ఇన్సూరెన్స్ పాలసీకీ ఐటిడిఏ ద్వారా ప్రీమియం చెల్లించాలని కోరారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమ్మెతో సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, రాందాస్, భరత్, రాంబాయి, బాదిరావు, మధు, కైలాస్, కపిల్, అశోక్, రాములు తదితరులుపాల్గొన్నారు.

ఇబ్బందుల్లో విద్యార్థులు..

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో దిగడంతో విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రెండవ రోజు ఉట్నూరు మండలంలోని పాఠశాలల్లో సిబ్బంది అక్కడక్కడ తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటుండగా గాదిగూడ మండలంలోని చింతగూడలో ఉన్న శాటిలైట్ సెంటర్లో చదువుకుంటున్నారు. 200 మంది విద్యార్థులకు వంట చేసే వారు, పారిశుద్ధ సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులే వంటలు చేసుకుంటూ, పరిసరాలను కూడా పరిశుభ్రం చేసుకుంటున్నారు. ఈ విషయమై ఉట్నూరు ఏటిడిఓ క్రాంతి కుమార్‌ను ప్రశ్నించగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని, ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని తెలిపారు.



గద్దె కూలిపోవడంతో రోడ్డుపై పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు



బోథ్ మండల కేంద్రంలో ఇళ్లలోకి చేరిన వరదనీరు

బోథ్‌లో భారీ వర్షం

- గద్దె కూలడంతో రోడ్డుపై పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఇళ్లలోకి చేరిన వరద నీరు.. కూలిన ఇల్లు

బోథ్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకు 35.6 మి.మీ వర్షం కురిసింది. దీంతో మండలంలో జనజీవనం స్తంభించిపోయింది. మండల కేంద్రంలోని ఒకటో వార్డులో అధిక వర్షాల వల్ల ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కూలడంతో గద్దెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ప్రమాదం సంపటన జరిగిన విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు అర్ధరాత్రి వరకు వర్షంలో ఉండి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇక పట్టణంలోని 14, 15 వార్డులతో పాటుగా సాయి నగర్ కాలనీలో ఉధృతి కారణంగా ఇండ్లలోకి నీరు ప్రవేశించాయి. దీంతో పలు కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు.

మరలపల్లిలో కూలిన ఇల్లు

బోథ్: మండలంలోని మరలపల్లి గ్రామంలో భారీ వర్షానికి పడగల రాములుకు చెందిన ఇల్లు సోమవారం రాత్రి కూలింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కాగా ఇల్లు కూలిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుభాష్ చంద్ర రెవెన్యూ సిబ్బందిని గ్రామానికి పంపించడం జరిగింది.

ఉప్పొంగిన నక్కలవాడ వాగు

బోథ్: మండలంలోని నక్కల వాడ వాగు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....